అసలేమీ చెప్పొద్దన్నారు ఆ సినిమా గురించి!

8 లో..

తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 01 | శుక్రవారం డిసెంబర్ 13 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


ఇదండీ..కబురు..






# కిషన్‌రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కిషన్‌రెడ్డి నివాసానికి వచ్చిన సీఎం.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు తదితర ప్రాజెక్టులకు నిధుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సింగరేణికి బొగ్గు గనులు తదితర అంశాలపై కేందమంత్రితో సీఎం చర్చించారు. అనంతరం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. విద్యారంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.కాగా, ఏఐసీసీ పెద్దలను కూడా సీఎం రేవంత్ కలిసే అవకాశముంది. కేబినెట్ విస్తరణపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేబినెట్‌లో చోటు కోసం అధిష్టానం పెద్దల చుట్టూ ఆశావహులు చక్కర్లు కొడుతున్నారు.రంగారెడ్డి నుంచి తనకు అవకాశం ఇవ్వాలని ఏఐసీసీ పెద్దలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కలిశారు. బీసీ వర్గం నుంచి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అవకాశం కోరుతున్నారు. ఆదిలాబాద్ నుంచి తనకు ఛాన్స్ ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ అడుగుతుండగా, మరో వైపు.. ఎస్సీ కోటాలో మంత్రి పదవి కోసం వివేక్ ప్రయత్నాలు చేస్తున్నారు.

## మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు



కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

సినీనటుడు మోహన్‌బాబు పై పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మీడియా ప్రతినిధిపై దాడి ఘటనలో ఆయనపై తొలుత బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు నమోదైంది. తాజాగా లీగల్ ఒపీనియన్ తీసుకున్న పోలీసులు.. 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

2లో..

## మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం హైకమాండ్‌దే: భట్టి విక్రమార్క



కబురు,దిల్లీ: డిసెంబర్ 12

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హైకమాండే నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు."ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు వందశాతం సంతోషంగా ఉంటారనుకోవట్లేదు. ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుంది. హైడ్రాకు పేద, ధనిక అనే తేడా లేదు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.



## రైతుకు బేడీలు వేయాల్సిన అవసరం ఏమొచ్చింది?.. సీఎం రేవంత్ సీరియస్

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్‌కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీనొప్పి వచ్చింది. జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి తీసుకెళ్లిన ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు.

2లో..



## విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం

- చలికివణుకుతున్న విద్యార్థులు : ఎమ్మెల్సీ కవిత

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

రాష్ట్రంలో గురుకులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

2 లో




## రాష్ట్ర చరిత్రలోనే ఫస్ట్ టైమ్: మహిళ సమాఖ్య సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా మహిళా సమాఖ్య సభ్యులకు యూనిఫాం చీరలు ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 63 లక్షల మంది మహిళా సంఘ సభ్యులకు ఉచితంగా ఈ యూనిఫాం చీరలు ఇవ్వాలని నిశ్చయించింది. ఈ యూనిఫాం చీరల కోసం ప్రత్యేకంగా డిజైన్లు రూపొందించారు. మహిళా సంఘాల కోసం తయారు చేసిన యూనిఫాం చీరలను సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ గురువారం (డిసెంబర్ 12) మంత్రి సీతక్కకు చూయించారు.

2 లో



## ప్రకటనలు కాదు కావల్సింది.. పథకాలు

- ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలతో కాలం గడుపుతుందని, కావల్సింది ప్రకటనలు కాదని పథకాలని అవి గుర్తుపెట్టుకుంటే మంచిదని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొటారన్నారు.

02

## ఏసీబీ కస్టడీకి నిఖేశ్ కుమార్.. నాంపల్లి కార్యాలయానికి తరలింపు



నిఖేశ్‌కుమార్

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 12

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన నీటి పారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఆయన్ను చంచల్‌గూడ జైలు నుంచి నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఏసీబీ అధికారులు నాలుగు రోజుల పాటు విచారించనున్నారు. ఆయన సమక్షంలో బ్యాంకు లాకర్లు తెరవనున్నారు. ఇప్పటికే నిఖేశ్ కుమార్ బినామీ ఆస్తుల వివరాలను అధికారులు సేకరించారు. అతడి స్నేహితుల బ్యాంక్ లాకర్ ఓపెన్ చేసి భారీగా బంగారంతో పాటు కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.నీటిపారుదల శాఖలో ఏఈఈగా పనిచేస్తూ ఇటీవల అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు చిక్కిన నిఖేశ్‌కుమార్ రోజుకు తక్కువలో తక్కువ రూ.2లక్షలపైగా సంపాదించాడు. ఉద్యోగంలో చేరిన అనతి కాలంలోనే అడ్డగోలు సంపాదనకు రుచి మరిగిన నిఖేశ్‌కుమార్‌తోపాటు సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ బృందాలు చేసిన దాడిలో రూ.17.73 కోట్ల అక్రమాస్తులు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఒక లాకర్‌లో మరో కిలోన్నర బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. వీటన్నింటి విలువ బహిరంగ మార్కెట్‌లో అథమపక్షం రూ.100 కోట్లపైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆయన ఉద్యోగంలో చేరి పదేళ్లవుతోంది. ఈ క్రమంలో అతడి అక్రమార్జన గురించి లెక్కగడితే సగటున రోజుకు రూ.2లక్షలకు తక్కువ కాకుండానే ఉన్నట్లు తేలుతోంది. ఇంత భారీగా కూడబెట్టేందుకు నిఖేశ్‌కుమార్ ఎలాంటి కుయుక్తులకు పాల్పడ్డాడనేది తేల్చేపనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు. ఆయన మరెవరికైనా బినామీగా వ్యవహరించాడా అనే విషయాన్నీ తేల్చే ప్రయత్నంలో ఉన్నారు.



## మేం మళ్లీ వస్తే.. మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తాం

కబురు, దిల్లీ: డిసెంబర్ 12

ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవిందవ్ కేజ్రీవాల్ ఢిల్లీ మహిళలకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. మహిళా సమ్మాన్ యోజనకు ఢిల్లీ ప్రభుత్వం కేబినెట్ ఆమోదం తెలి పింది. ఈ పథకం కింద గురువారం ( డిసెంబర్ 12) నుంచి దేశరాజధానిలోని మహిళలకు నెలకు రూ.1000 ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మరో బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. ఢిల్లీలో ఆప్ తిరిగి అధికారంలోకి వస్తే .. మహిళా సమ్మాన్ యోజన కింద వెయ్యికి బదులుగా రూ. 2వేలు ఇస్తామని ప్రకటించారు.

02

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం



# సరైన దిశలో ఒక ప్రయత్నం

ఎట్టకేలకు ఒక అడుగు ముందుకు పడింది. బంగ్లాదేశ్‌లోని పరిస్థితి పట్ల తన మనోభావాలను భారత్ స్పష్టంగా పంచుకోగలిగింది. బంగ్లాదేశ్‌లోని మధ్యంతర సర్కారుకు ప్రధాన సలహాదారైన మహమ్మద్ యూనస్, బంగ్లా విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్ తదితరులతో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఢాకాలో సమావేశమవడం ఆహ్వానించదగ్గ పరిణామం.ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయాక రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న వేళ భారత్ నుంచి తొలిసారిగా ఓ ఉన్నతాధికారి బంగ్లా వెళ్ళడం, దౌత్య భేటీ జరపడం విశేషమే. ఇటు హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడం, అటు బంగ్లాలో అల్పసంఖ్యాక హిందువులపై దాడులతో ద్వైపాక్షిక సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజా భేటీలో ఇరుపక్షాలూ నిర్మొహమాటంగా పరస్పరం అభిప్రాయాలు పంచుకోవడం సరైన దిశలో పడిన అడుగు. హసీనా హయాంతో పోలిస్తే, భారత్ పట్ల పెద్ద సానుకూలత లేని సర్కారు బంగ్లాలో ప్రస్తుతం నెలకొన్నందున తాజా దౌత్యయత్నాలు కీలకం. చారిత్రకంగా మిత్రత్వం, పరస్పర ప్రయోజనాలున్న పొరుగు దేశాలు అపోహలు, అనుమానాలు దూరం చేసుకోవడానికి ఇవి ఏ మేరకు ఉపకరిస్తాయో చూడాలి. బయట ఉద్రిక్త వాతావరణం ఉన్న సమయంలో జరిగిన ఈ చర్చలు మైనారిటీలపైన, హిందూ ఆలయాలపైన దాడులు, రాజద్రోహ నేరంపై హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు సహా అనేక వివాదాస్పద అంశాలపై దృష్టి సారించాయి. రెండు కోట్ల పైగా హిందువులున్న ముస్లిమ్ మెజారిటీ దేశంలో మైనారిటీల భద్రతపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తే, ఆ ఘటనలు రాజకీయమైన వంటూ బంగ్లా వాదించింది.ప్రజల భావోద్వేగాలు, రాజకీయ ప్రయోజనాలు కలగలిసినప్పుడు పరస్పర భిన్న వాదనల మధ్య రాజీ కుదర్చడం కష్టమే. కానీ, విదేశాంగ శాఖ కార్యదర్శుల భేటీతో చిరు ప్రయత్నమైనా సాగడం విశేషం. బంగ్లాదేశ్ సైతం ఇప్పటికైనా కళ్ళు తెరిచి, జరుగుతున్నదే మిటో గ్రహించి, అసలంటూ సమస్య ఉన్నదని గుర్తించడానికి ఈ భేటీ ప్రేరేపిస్తే మంచిదే. 1971 నాటి బంగ్లాదేశ్ విముక్తి పోరులో భారత్ పాత్ర మరపురానిది. అదే సమయంలో స్వాతంత్ర్యం ముందు నుంచి చారిత్రకంగా ఉన్న అనుబంధం రీత్యా సాహిత్య, ఆర్థిక, ఆధ్యాత్మిక, రాజకీయ పరంగా ఆధునిక భారతావని రూపుదిద్దుకోవడంలో బంగాళ ప్రాంతపు భాగ స్వామ్యం అవిస్మరణీయమే.బ్రిటీషు కాలం నుంచి భౌగోళిక రాజకీయాలు, సామాజిక సాంస్కృతిక కారణాలతో ముడిపడిన భారత - బంగ్లా బంధం ఇటీవలి ఉద్రిక్తతల నడుమ నలిగిపోతోంది. ఇరుదేశాల మధ్య 4,096 కి.మీల ఉమ్మడి సరిహద్దుంది. ప్రపంచంలోనే సుదీర్ఘమైన అయిదో సరిహద్దు ఇది. పైగా, చాలా ప్రాంతంలో పూర్తిస్థాయిలో సరిహద్దుల గుర్తింపు జరగనేలేదు. సరిహద్దులో నెలకొన్న పశ్చిమ బెంగాల్‌లోని ఒక్క పెట్రాపోల్ వద్దనే రెండు దేశాల మధ్య భూమార్గ వాణిజ్యంలో 30 శాతం జరుగుతుంది. ఏటా సుమారు 23 లక్షల మంది సరిహద్దులు దాటి, భారత్‌కు వైద్య చికిత్సకు వస్తుంటారు. కాబట్టి, ఇటీవలి ఉద్రిక్తతల్ని దాటి వాణిజ్యం, ఇంధనం, సహకారం, సామర్థ్యాల పెంపుదలను బంగ్లా చూడగలగాలి. ఇరుదేశాలూ చేతులు కలిపి అడుగులు వేస్తేనే అభివృద్ధి సాధ్యం. ఉల్లిపాయలు, బంగాళదుంపలు, వెల్లుల్లి లాంటి నిత్యావసర వస్తువుల విషయంలో ఢిల్లీ పైనే ఢాకా ఆధారపడి ఉంది. కానీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశం దేశీయ ఉత్పత్తిని పెంచుకొని, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తోంది. ఇక, బంగ్లా రోగులకు శస్త్రచికిత్స చేసేది లేదంటూ కొన్ని భారతీయ ఆస్పత్రులు అమానవీయంగా, మూర?ంగా వ్యవహరించడం సమర్థనీయం కాదు.ఈ చర్యల వల్ల బంగ్లా దేశీయులు ఇప్పుడు మలేసియాను ఆశ్రయిస్తున్నట్టు వార్త. ఇలాంటివన్నీ దీర్ఘకాలంలో భారత ప్రయోజనాలకే దెబ్బ. అసలు మిగతా ప్రపంచంతో భారత వాణిజ్యంతో పోలిస్తే, సరుకుల్లో భారత %-% బంగ్లాల ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా వృద్ధి చెందింది. అనేక అంశాలు ముడిపడి ఉన్నందున తెగేదాకా లాగడం ఇరుపక్షాలకూ మంచిది కాదు.కొత్త వాస్తవాలను గుర్తించక ఒకవేళ మనం ఇదే వైఖరితో ముందుకు సాగితే చివరకు నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్, మాల్దీవులు, మయన్మార్ వరుసలోనే బంగ్లాదేశ్ సైతం ఢిల్లీకి దూరమవుతుంది. పొరుగున మిత్రులెవరూ లేని దుఃస్థితి భారత్‌కు దాపురిస్తుంది.యూనస్ సారథ్యంలోని ప్రస్తుత బంగ్లా సర్కార్ పాక్‌కు చేరువవుతోంది. ఇటీవల రెండు దేశాల మధ్య వీసాల ఎత్తివేత, రక్షణ ఒప్పందాలు, కరాచీ నుంచి పాకిస్తానీ సరుకుల రవాణా నౌకను చిట్టగాంగ్ వద్ద లంగరేసుకునేందుకు అనుమతించడం లాంటివి చూస్తే అదే అనిపిస్తోంది.దాదాపు 47 ఏళ్ళ తర్వాత రెండు దేశాల మధ్య నేరుగా సముద్ర నౌకాయాన సంబంధాల పునరుద్ధరణకు ఇది ఒక సూచన. వ్యూహాత్మకంగా సుస్థిర దక్షిణాసియాకు కట్టుబడ్డ భారత్ జాగ్రత్తగా అడుగులు వేయాలి. బంగ్లా అంతర్గత రాజకీయాల్లోకి అతిగా జొరబడి, ప్రస్తుత హయాం నమ్మకాన్ని పోగొట్టు కోరాదు.ఈ పరిస్థితుల్లో భారత విదేశాంగ కార్యదర్శి ఢాకా పర్యటన ఇరుగుపొరుగు బాంధవ్యం, భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని గుర్తించినట్టే అనిపిస్తోంది. బంగ్లా సైతం ముందుగా తన అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుకోవాలి. ఆ దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొంటే, మైనారిటీలు సురక్షితంగా ఉంటే, పాత బంధం మళ్ళీ మెరుగవుతుంది.వెరసి, భారత్ - బంగ్లాలు ప్రస్తుతం నాలుగురోడ్ల కూడలిలో నిలిచాయి. మనసు విప్పి మాట్లాడుకొని, పరస్పర ప్రయోజనాల్ని కాపాడుకుంటే మేలు. అలాకాక సహకార మార్గం బదులు సంఘర్షణ పథాన్ని ఎంచుకుంటే ఇరువురికీ చిక్కే!

# రైతుకు బేడీలు వేయాల్సిన అవసరం ఏమొచ్చింది?.. సీఎం రేవంత్ సీరియస్

మొదటిపేజీ తరువాయి
రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడిన సీఎం.. ఘటనపై ఆరా తీశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. ప్రజాప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారు. హీర్యా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు.ఛాతీనొప్పి రావడంతో రైతు హీర్యానాయక్‌కు మొదట సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం హీర్యానాయక్ ఆరోగ్యం నిలకడగా ఉందని సంగారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తెలిపారు. హార్ట్ బీట్ కొంచెం తక్కువగా ఉందని, గతంలో కూడా గుండె నొప్పి వచ్చిందని చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం పంజాగుట్ట నిమ్స్‌కు రిఫర్ చేశామని చెప్పారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో రైతుకు చికిత్స అందిస్తున్నారు.

### పోలీసుల తీరుపై కేటీఆర్ ఆగ్రహం

రైతు హీర్యానాయక్‌కు గుండెనొప్పి వస్తే బేడీలు వేసి జైలు నుంచి ఆసుపత్రికి తరలించడం క్షమార్హం కాదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన వ్యక్తిని బేడీలు వేసి తీసుకురావడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. రైతులను కస్టడీలో చిత్రహింసలు పెట్టారని మేజిస్ట్రేట్ ముందు చెబితే.. కుటుంబ సభ్యులను కూడా కొడతామని బెదిరించారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట వినకపోవడమే వారు చేసిన తప్పా? అని నిలదీశారు.

### అన్నం పెట్టే రైతుకు బేడీలు వేస్తారా?: హరీశ్‌రావు

దేశానికి అన్నం పెట్టే రైతన్నకు బేడీలు వేశారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. రైతు హీర్యానాయక్ ఉగ్రవాదా? దోపిడీ దొంగా? అని ప్రశ్నించారు. రైతుల భూములు లాక్కుంటారు.. తిరగబడితే అరెస్టులు చేస్తారని ఆరోపించారు.

# ప్రకటనలు కాదు కావల్సింది.. పథకాలు

మొదటిపేజీ తరువాయి
కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరెంట్, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో? అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అమ్మల విషయంలో, అన్నదాతల విషయంలో వివక్ష చూపొద్దన్నారు. పథకాల అమలు ఎగవేతకు కారణాలు వెతకొద్దన్నారు.

# విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం

మొదటిపేజీ తరువాయి
విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు.

# మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి
కుటుంబ సమస్యను శాంతిభద్రతల సమస్యగా మార్చొద్దు: మంచు సోదరులతో సీపీ కుటుంబ వివాదం నేపథ్యంలో మంగళవారం జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసానికి మీడియా ప్రతినిధులు వెళ్లారు. ఈ క్రమంలో మోహన్‌బాబుతో పాటు వచ్చిన బౌన్సర్లు, సహాయకులు.. గేటు లోపల ఉన్న మీడియా ప్రతినిధులను బయటకు తోసేయడంతో పాటు కర్రలతో దాడిచేశారు. ఓ ఛానల్ ప్రతినిధి చేతిలో నుంచి మోహన్‌బాబు మైకు లాక్కుని ముఖంపై కొట్టారు. బౌన్సర్లు నెట్టేయడంతో ఓ ఛానల్ కెమెరామన్ కింద పడ్డాడు. ఈ నేపథ్యంలో కేసు నమోదైంది.

# మేం మళ్లీ వస్తే.. మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తాం

మొదటిపేజీ తరువాయి
వచ్చే ఏడాది ( 2025) ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ కాలం ఫిబ్రవరి 23, 2025తో ముగుస్తుంది. ఇంకా తేదీ ప్రకటించక పోయి నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.ఇచ్చిన మాట ప్రకారం ఢిల్లీ మహిళలకు మహిళా సమ్మాన్ యోజన పథకం కింద రూ.1000 ప్రకటించారు. మహిళలు రిజిస్టర్ చేయించుకొని లబ్ది పొందాలని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ చెప్పారు.

ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో AAP రెండుసార్లు అధికారం చేపట్టింది.. మూడోసారి కూడా అధికారాన్నినిలబెట్టుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించింది. 70 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఆప్ 2015లో 67 సీట్లు, 2020లో 63 సీట్లు గెలుచుకుంది.

# రాష్ట్ర చరిత్రలోనే ఫస్ట్ టైమ్: మహిళ సమాఖ్య సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి
సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో త్వరలో యూనిఫామ్ చీరల డిజైన్లను ఖరారు చేయనున్నారు. చీరల డిజైన్లు ఫైనలైజ్ చేసిన తర్వాత 63 లక్షల మంది మహిళ సంఘ సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై మహిళా సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా ఆర్థికాభివృద్ధి కోసం తెలంగాణ మహిళాశక్తి' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ స్కీమ్ కింద వచ్చే ఐదేళ్లలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను అందించున్నారు. గ్రామాల్లోని మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించి వారిని కోటీశ్వర్లును చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసమే ఈ పథకం తీసుకువచ్చింది.

# ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడుల్లో బయటపడ్డ భయంకరమైన వాస్తవం..!



మీరు చదివింది నిజమే మరి..! ఇప్పుడు హైదరాబాద్ మహానగరంలో చాలా చోట్ల అలాంటి టీ నే దొరుకుతుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు జరిపిన దాడుల్లో భయంకరమైన వాస్తవం బయటపడింది.కాచిగూడలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా కల్తీ టీ పౌడర్ తయారు చేస్తున్న బండారాన్ని ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం బయటపెట్టింది. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఛాయ్‌పత్తా అసలు రంగు ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి వచ్చింది. ఒక కిలో.. రెండు కిలోలు కాదు, ఏకంగా నాలుగు క్వింటాళ్ల కల్తీ టీ పౌడర్ బాగోతం గుట్టురట్టైంది. దీని విలువ మార్కెట్లో దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కల్తీ ఛాయ పత్తి మాఫియా గ్యాంగ్ లీడర్ మహేష్ గిరి అనే వ్యక్తిని ఫుడ్ సేఫ్టీ అధికారులు తేల్చారు.కాచిగూడలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మహేష్ గిరి మరి కొందరితో కలిసిఈ కల్తీ ఛాయ్‌పత్తా దందాకు తెర తీశారు. బేగంబజార్ లో చాయ్ పత్తాని కొన్న తర్వాత కాచిగూడలోని అద్దె ఇంట్లోకి తీసుకొచ్చి అందులోని కొన్ని పదార్థాలను మిక్స్ చేసి ఫుట్ పాత్‌లపై ఉండే ఛాయ్ దుకాణాలకు ఈ ఛాయపత్తాను అమ్ముతారు. ఈ కల్తీ ఛాయపత్తిలో క్యాన్సర్ కారకమైన అతి భయకరమైన క్యాసినోజెనిక్ అనే పదార్థం ఉన్నట్లుగా ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు.ఈ టీపొడిని టిష్యూ పేపర్ పైన వేసి దానిపై తాగే నీరు వేసినప్పుడు పేపర్ మొత్తం రెడ్ కలర్‌గా మారిపోయింది. సాధారణంగా టీ పొడి పై నీరు పోసినప్పుడు ఎలాంటి కలర్లు విడుదల చేయదు అన్నది ఫుడ్ సేఫ్టీ అధికారులు చెప్తున్న మాట. ఇంటిలో తయారు చేస్తున్న దాదాపు నాలుగు క్వింటాళ్ల ఛాయపత్తాను మొత్తం అధికారులు సీజ్ చేసి, చివరికి ఇంటికి తాళం వేసి సీలు వేశారు. ఈ కల్తీ దందాపై కేసు నమోదు చేసిన అధికారులు, మహేష్ గిరికి నోటీసులు జారీ చేశారు. కల్తీ చాయ్ పత్తి శాంపిల్స్ సేకరించి నాచారంలోని ఫుడ్ సేఫ్టీ స్టేట్ లేబొరేటరీకి పంపించారు.ఈ మ్యాటర్ చదివిన మీ అందరికీ టీవీ9 సూచన.. ఎప్పుడైనా ఎక్కడన్నా టీ తాగే దగ్గర డౌట్ వస్తే మాత్రం ఛాయ పత్తాను వైట్ టిష్యూ పేపర్ పైన వేసి దానిపై తాగే నీరు వేస్తే కలర్ మారితే అది కన్ఫామ్ గా కల్తీ చాయ్ పత్తా అని ఈజీగా ఫైండ్ అవుట్ చేయొచ్చు..!

## టిపిసిసి అధ్యక్షుని కలిసిన పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి



**కబురు న్యూస్, బాన్సువాడ, డిసెంబర్ 12**

బాన్సువాడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా మంత్రి అంజవ్వ గణేష్ లకు నియామక ఉత్తర్వులు జారీ చేసినందుకు గురువారం టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంత్రి అంజావ గణేష్ దంపతులతో కలిసి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, భాస్కర్ రెడ్డి, ప్రతాప్ సింగ్,పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, అమ్జాద్,కమ్మ సత్యనారాయణ, రఫీక్ , భాను గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా...

**కబురు న్యూస్,బోధన్ డిసెంబర్12..**





గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల గ్రంథాలయాన్ని మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి తో కలిసి సందర్శించారు. పాఠకులకు అందుతున్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం గ్రంథాలయాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన పుస్తకాలు పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం విద్యార్థిని, విద్యార్థులు సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు శ్రావణ్, సందీప్, రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ప్రమోద్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారీ నవీన్, కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి దంపతులను సత్కరించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్

**కబురు న్యూస్ బాన్సువాడ, డిసెంబర్ 12**



బాన్సువాడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా మంత్రి అంజవ్వ గణేష్ దంపతులు గురువారం హైదరాబాద్ లో పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అప్పగించినందుకు పార్టీ ఇన్చార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యలమంచిలి శ్రీనివాసరావు, నాయకులు అంజద్, పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, సొసైటీ డైరెక్టర్ బండి సాయిలు యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాను గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం...



**కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 12..**

బోధన్ పట్టణ శివారులోని పసుపువాగులో ఒక గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయినట్లుగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చని, 5.5 అడుగుల ఎత్తు, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంటు, గోదుమ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, లైట్ గ్రీన్ కలర్ బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఎక్కడైనా ఈ వ్యక్తికి సంబంధించి మిస్సింగ్ కేసులు ఉన్నట్లయితే బోధన్ పోలీస్ లకు సంప్రదించాలని సీఐ సూచించారు.

# క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలి.... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు









**- చదువుతోపాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో ముఖ్యం... కార్పొరేషన్ చైర్మన్ కాసుల**

**కబురు న్యూస్, బాన్సువాడ డిసెంబర్ 12**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని మిని స్టేడియంలో మూడు రోజులపాటు జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాకారుల అభివృద్ధి కోసం బడ్జెట్లో 200 కోట్లు కేటాయించడం జరిగిందని, గ్రామీణ స్థాయి క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయన్నారు. చిన్ననాటి నుండి విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరిచినట్లయితే మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన సోమేశ్వర్ గ్రామానికి చెందిన సాయి తేజ క్రీడాకారున్ని ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. వచ్చే సంవత్సరం క్రీడా పోటీలకు గ్రామాల నుండి క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యేలా చూడాలన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అవసరం ఉన్న తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎంపీడీవో బషిరుద్దీన్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఎంపీఓ సత్యనారాయణరెడ్డి,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖలేక్, నాయకులు అంజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్ బీన్ మోసిన్,నియోజకవర్గ అధ్యక్షులు మన్సూర్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు"

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్







**కబురు న్యూస్,నిజామాబాద్,డిసెంబర్ 12 :**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి, పెర్కిట్ లలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహమా, నివేశన స్థలానికి సంబంధించి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా? తదితర అంశాలను పరిశీలిస్తూ మొబైల్ యాప్ లో వివరాలు నమోదు చేయించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది, రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు, ఆన్లైన్లో ఎన్ని వివరాలను అప్లోడ్ చేశారని అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి, వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ యాప్ లో నమోదు చేయాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే, అలాంటి వారి వివరాలను కూడా సర్వే యాప్ లో పొందుపర్చాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ధి చేకూరేందుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు.కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్,మున్సిపల్ కమిషనర్ రాజు,తహశీల్దార్ గజానంద్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికి తీయడమే ప్రభుత్వ లక్ష్యం... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

**- విజేతలకు బహుమతులు అందజేసిన కార్పొరేషన్ చైర్మన్**





**కబురు న్యూస్ రుద్రూర్, డిసెంబర్ 12,**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ప్రశాంతతో పాటు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. గురువారం వర్ని, రుద్రూర్ మండల కేంద్రాల్లో సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికిదీసేందుకు క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులు క్రీడాలో జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు తాను కూడా క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, ఎంపీడీవో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, కామారెడ్డి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్, నార్ల నందకిషోర్,మాజీ జడ్పిటిసి నారోజిగంగారం, నాయకులు నేమాని వీర్రాజు, అసద్ బిన్ మోసిన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మన్సూర్, తదితరులు పాల్గొన్నారు

## బిజెపి పార్టీలో చేరిన ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్...

**- పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తా... కోనేరు శశాంక్**

**కబురు న్యూస్ బిచ్కుంద , డిసెంబర్, 12**

కోటగిరి మండలం ఎత్తోండ గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కోనేరు శశాంక్ గురువారం బిజెపి జిల్లా అధ్యక్షురాలు అరుణతార సమక్షంలో పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయుడు కోనేరు శశాంక్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితునై పార్టీలో చేరడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలతో కలిసి ముందుకు వెళ్తానన్నారు.గ్రామ గ్రామాన బిజెపి పార్టీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, వర్ని, రుద్రుర్,నసురుల్లాబాద్, మండలాల అధ్యక్షులు శంకర్, హరికృష్ణ, సున్నం సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దటమే మా లక్ష్యం

– జిల్లా అధ్యక్షులు గడ్డం భక్తవత్సలం (ఢిల్లీ )...




కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 12 :
ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని నూతన అధ్యక్షులు గడ్డం భక్తవవత్సలం (ఢిల్లీ) అన్నారు. నిజామాబాద్ నగరం లోని రాష్ట్రపతి రోడ్ లో బాపూజీ వచనలయ కార్యాలయం లో నూతన కమిటీకి ఎన్నికల అధికారి ఎం.ఎస్.ఆచార్య ప్రమాణ స్వీకారం చేయించి ప్రసంసా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాపూజీ వచనాలయ అధ్యక్షులు గడ్డం భక్తవత్సలం మాట్లాడుతూ,బాపూజి వచనాలయం పేద, బీద మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు వేదికగా నిలబడి వారిని ఉత్తమ విద్యార్థులుగా ఉద్యోగులుగా తీర్చిదిద్దుతుందన్నారు. బాపూజీ వచనాలయంలో అన్ని ఎగ్జామ్ లకు ప్రిపేర్ అయ్యే బుక్కులను అందుబాటులో ఉంచామన్నారు. నగరంలోని బాపూజీ వచనాలయాలకు అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీ ల నాయకులు సహకరించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. లైబ్రరీని తెలంగాణలో ఎక్కడ లేని విదంగా సరికొత్త ఆలోచన తో డిజిటల్ లైబ్రరీని నిజామాబాద్ విద్యార్థుల కోసం తీసుకొస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎమ్మెస్ ఆచార్య మాట్లాడుతూ, శాంతియుత వాతావరణం లో ఎన్నికలు జరగడం ఆనందంగా ఉందన్నారు. గెలిచిన అభ్యర్థులు అభివృద్ధి వైపు లేసి తెలంగాణలో మొదటి లైబ్రరీగా ఉంచాలని అన్నారు. గెలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు పులి జైపాల్,నారాయణ,కార్యదర్శిగా మీసాల సుధాకర్ రావు,కోశాధికారిగా బి గంగాధర్ రావు,ఉపాధ్యక్షులుగా భవంతి దేవిదాస్,బోగా అశోక్,సంయుక్త కార్యదర్శిగా ఎ.ఎస్.సాంబయ్య,దత్తాత్రి,కార్యవర్గ సభ్యులుగా లక్కం రెడ్డి,జగన్,ఆమందు విజయ్,పుల్గమ్ హనుమండ్లు,అరెట్టి లక్ష్మి నారాయణ,కసుబ సంపత్, గందరి మహిపాల్ రెడ్డి,పాటి అనిల్ రెడ్డి,రుద్ర ప్రతాప్,గాదె మోహన్ రావు,మహ్మద్ ఖయ్యూం,గోవింద్ ప్రసాద్ జ్వవార్ లు ప్రమాణ స్వీకారం చేశారు.

# 14 న జిల్లా సాయి హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 12 :



జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపికను తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గంగా మోహన్ చక్రు పింజా సురేందర్ లు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ ఎంపికలు జెడ్ పి హెచ్ ఎస్ కల్లెడ పాఠశాలలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఎంపికల ప్రతిభ నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో జనవరి 2025 హైదరాబాదులో నిర్వహించబోయే 2వ ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలకు పంపనున్నట్లు తెలియజేశారు.ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు తేది 01-01-2010 నాడు తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు.క్రీడాకారులు తమ వెంట జనన ధ్రువీకరణ పత్రంతో ఈనెల 14వ తేదీ శనివారం ఉదయము 10 గంటలకు జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకొని జిల్లా హ్యాండ్బల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేష్ కు రిపోర్ట్ చేయాలని కోరారు.ఇతర వివరాలకు 9642535535,9440441757 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# ఇంటర్ కాలేజ్ వాలీబాల్ పోటీలను ప్రారంభించిన వైస్ ఛాన్సలర్

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 12 :





తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ వాలీబాల్ మెన్ & ఉమెన్ చాంపియన్షిప్ 2024,పోటీలను ఉదయం 10 గంటలకు యూనివర్శిటీ ప్లే గ్రౌండ్ లో వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు,రిజిస్టర్ ఎం యాదగిరి ప్రారంభించారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ టి యాదగిరిరావు మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయాలనే సంకల్పంతో ఉందని తెలిపారు.తెలంగాణ విశ్వవిద్యాలయం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి రాష్ట్ర,జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం విశ్వవిద్యాలయ ఉద్దేశమని పేర్కొన్నారు. అందుకు అన్ని రకాల అంగుళం ఏర్పాటు చేస్తుందని హామీ ఇచ్చారు.రిజిస్ట్రార్ ప్రో. ఎం యాదగిరి గారు మాట్లాడుతూ, విద్యతో పాటు సమాంతరంగాక్రీడలు ఎల్లవేళలా నిర్వహించాలని ఆటల వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలియజేయడం జరిగింది.విద్యార్థినీ విద్యార్థులు ప్రతిరోజు గేమ్స్ ప్రాక్టీసు చేసి విశ్వవిద్యాలయానికి గుర్తింపు తేవాలని సూచించారు.ఈ టోర్నమెంట్ లో ఉమ్మడి జిల్లాల 13 కళాశాల నుండి పురుషులు మరియు 11 కళాశాల నుండి మహిళ క్రీడాకారినులు సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.వాలీబాల్ పురుషుల విన్నర్స్ గా తెలంగాణ విశ్వవిద్యాలయం రన్నర్స్ గా గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిజాంబాద్ నిలిచింది.మహిళల విభాగంలో విన్నర్స్ గా జి జి కాలేజ్ నిజాంబాద్ కైవసం చేసుకోగా రన్నర్స్ గా టీజీ డబ్ల్యూ ఆర్ డి సి ఆర్మూరు నిలిచింది.ఈ టోర్నమెంట్ లో విజేతలకు మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ డైరెక్టర్ డాక్టర్ జి బాలకృష్ణ ప్రదానం చేశారు.ఈ టోర్నమెంట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ డాక్టర్ బి ఆర్ నేత,మరియు ఫిజికల్ డైరెక్టర్స్ డా. బాలమని, రమ,రూప,అంజలి,అనిల్ కుమార్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ చేసిన నాయకులు



కబురు న్యూస్ బాన్సువాడ డిసెంబర్ 12



బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో గురువారం అంబేద్కర్ సంఘ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా వారి ఆశయాలను నెరవేర్చినప్పుడే మనం వారికిచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షులు ఉద్దేరా హన్మాండ్లూ, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, నారాయణరెడ్డి, సాయి రెడ్డి,రాజ్ కుమార్, బండి పండరి, కామేశ్వర్,అంబేద్కర్ సంఘ సభ్యులు శివయ్య, డ్రైవర్ భూమయ్య, సంగమేష్, జల్లయ్య, గంగారం, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత బీసీల గురించి మాట్లాడడం హాస్యాస్పదం

–కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్...




కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 12 :
కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరిస్తుందని కవిత మాట్లాడడం హాస్యాస్పదమని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్ అన్నారు.గురువారం నిజమాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,బీసీలను వంచించింది బి.ఆర్.ఎస్ పార్టీయేనన్నారు.పదేళ్ల పాలనలో రాజకీయంగా ఆర్థికంగా రాష్ట్రంలో బీసీలు వెనుకబడి పోయారని, కేవలం కొంతమందికి బర్ల గొర్రెలు చాప పిల్లల పంపిణీ చేసి బీసీలను ఉద్ధరించామని ప్రగల్బాలు పలికారని తెలిపారు.గొర్రెల పంపిణీ,చేప పిల్లల పంపిణీలలో కూడా విపరీతమైన అవినీతికి పాల్పడిన నీచ చరిత్ర బిఆర్ఎస్ నాయకులదని ఆయన అన్నారు. బీసీ బందు ప్రకటిస్తామని చెప్పి బీసీలను మోసం చేసిన ఘనత చరిత్ర బి ఆర్ ఎస్ పార్టీదని అన్నారు.తమరి పాలనలో వివిధ బీసీ కార్పొరేషన్ల ద్వారా ఎంతమందికి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేశారో కవిత సమాధానం చెప్పాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలంలోనే బీసీల అభ్యున్నతి కోసం ప్రణాళికలు రచిస్తుందని మంత్రివర్గంలో బీసీలకు పెద్దపీట వేయడంతో పాటు పార్టీ సంస్థాగత పదవులు బీసీలకు కట్టబెట్టిందని తెలిపారు. .కాంగ్రెస్ పార్టీ అంటేనే దళిత బహుజనల పార్టీ అని దళిత బహుజనుల అభివృద్ధికి ఎల్లప్పుడూ లబ్ధిచేసే విధంగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నగర యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తుటికూరి ప్రీతం,దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం హుండీ లెక్కింపు...



కబురు న్యూస్, బోధన్ డిసెంబర్ 12..
బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో దేవాదాయ శాఖ నిజామాబాద్ జిల్లా ఇన్స్పెక్టర్ కమల ఆధ్వర్యంలో ఆలయ హుండీ ని లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గురువారం చేపట్టిన ఈ హుండీ లెక్కింపు ద్వారా ఒక లక్ష నలభై వేల ఏడువందల తొంబై నాలుగు రూపాయలు శివాలయానికి ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో రవీందర్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రాములు, అర్చకులు గణేష్ మహారాజ్, మహేష్ మహారాజ్, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# కాకతీయ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్య అధికారి

కబురు న్యూస్,నిజామాబాద్,డిసెంబర్ 12 :



జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్
గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులను పరిసరాలను పరిశీలించారు.కళాశాల ప్రిన్సిపాల్,కార్యాలయ సిబ్బంది తో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా డిఐఈఓ మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కార్యాలయ రిజిస్టర్లన్నీ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.ఎలాంటి తప్పిదాలు దొర్లిన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావితం చూపిస్తాయని,జాగ్రత్తగా ప్రతి అంశాన్ని క్రోడీకరించాలని అన్నారు.విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు,సబ్జెక్టులు మార్చుకునేందుకు,ఫోటో, సంతకము తప్పిదం దొర్లితే సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని,క్షుణ్ణంగా పరిశీలించి డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు.రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు.కళాశాల ఆవరణ తో పాటు,తరగతి గదులను,ప్రయోగశాలలను,కనీసం అవసరాల కల్పనపై పర్యవేక్షణ చేశారు.నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ,పాలనాపరమైన అనుమతులు,పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేశారు.ఈ సమావేశంలో ప్రిన్సిపల్, సిబ్బంది, అధ్యాపకులు హాజరయ్యారు.బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళిక బద్దంగా బోధన,నిర్వహణ జరగాలని ఆదేశించారు.

# గాంధీ విగ్రహావిష్కరణకు రానున్న పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి

కబురు న్యూస్, బాన్సువాడ డిసెంబర్ 12



బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో గాంధీ విగ్రహ ఆవిష్కరణకు పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి శుక్రవారం రానున్నట్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు గాండ్ల సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# రోడ్డు కాదు రిజిస్ట్రేషన్ గల ఓపెన్ ప్లాట్

- ఎమ్మెల్సీ కవితకు,బీఆర్ఎస్ నేత రాంకిషన్ రావుకు ప్లాట్ తో ఎలాంటి సంబంధం లేదు...
- ప్లాట్ యజమాని కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతురావు బావమరిది నగేష్...




కబురు న్యూస్, నిజామాబాద్ డిసెంబర్ 12 : నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో ఆర్.కె.ఆర్. అపార్ట్ మెంట్ వద్ద ఉన్న స్థలం రోడ్డు కాదని రిజిస్ట్రేషన్ కలిగిన ఓపెన్ ప్లాట్ అని దాని యజమాని జన్నెపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నేత,మైనంపల్లి హనుమంతురావు బావమరిది నగేష్ అన్నారు.ఇటీవల ఆర్.కె.ఆర్. అపార్ట్ మెంట్ లో జరుగుతున్న వివాదంపై గురువారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో నగేష్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు.సంబంధిత ప్లాట్ విషయంలో బీఆర్ఎస్ నేత రామ్ కిషన్ రావు కు,ఎమ్మెల్సీ కవితకు ఈ ప్లాట్ తో ఎలాంటి సంబంధం లేదన్నారు.రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవిత,ఆమె కుటుంబాన్ని లాగుతున్నట్టున్నారని అన్నారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ సమీపంలోని బి.ఆర్. కె అపార్ట్మెంట్ సభ్యులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్.కె.ఆర్ అపార్ట్ మెంట్ లో నివాసముండేవారు ఓపెన్ ప్లాట్ విషయంలో అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని,తన సొంత ఫ్లాట్ ను అపార్ట్ మెంట్ వాసులు రహదారిగా చిత్రీకరిస్తూ అనవసరంగా రాజకీయ రంగు పులుముతున్నారన్నారు. వివాదం చేస్తున్న స్థలం రహదారి కాదని అది తన సొంత ఓపెన్ ఫ్లాట్ అని 219 సర్వేనెంబర్ లో ఉన్న 235 గజాల ఫ్లాట్ ను తాను కొన్నానని 2018 లోనే రిజిస్ట్రేషన్ చేసుకున్నానన్నారు. తన సొంత ఫ్లాట్ అని అపార్ట్ మెంట్ వాసులకు ఎటువంటి సంబంధం లేదని అనవసరంగా తన స్థలం కబ్జా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు . కొందరు వ్యక్తులు కావాలని దుర్దేశంతో రాజకీయ రంగు పులుమాలని చూస్తున్నారని దానిలో భాగంగానే ఎమ్మెల్సీ కవిత,రామ్ కిషన్ రావుల గురించి ప్రస్తావిస్తున్నారని వారికి ఈ స్థలంతో వివాదంతో ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. తన వద్ద స్థలానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు ఉన్నాయని మున్సిపల్ కార్పొరేషన్ లో టాక్స్ సైతం చెల్లిస్తున్నానని ఎవరు ఎప్పుడు అడిగినా అన్ని వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బి ఆర్ ఎస్ సీనియర్ లీడర్ తెలంగాణ శంకర్ మాట్లాడుతూ,అపార్ట్ మెంట్ స్థల వివాదానికి ఎమ్మెల్సీ కవిత,రామ్ కిషన్ రావులకు ఎటువంటి సంబంధం లేదని అనవసరంగా రాజకీయంగా పేరు చెడగొట్టాలని దురుద్దేశంతో కొందరు తమ నాయకుల పేర్లు ప్రస్తావిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## జర్నలిస్ట్ ల పై దాడి హేయమైన చర్య



- బాద్యులను కఠినంగా శిక్షించాలి

కబురు న్యూస్, న్యూస్ కోరుట్ల: డిసెంబర్ 12
హైద్రాబాదులో సినీ నటుడు మోహన్ బాబు, టివి9 రిపోర్టర్పైన దాడి చేయడాన్ని ఇటు జర్నలిస్టులు, అటు అఖిలపక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు. మోహన్ బాబు పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.హైద్రాబాదులో,టివి9 రిపోర్టర్ రంజిత్ పైన మోహన్ బాబు చేసిన దాడిని నిరసిస్తూ,జగిత్యాల జిల్లా కోరుట్లలో జర్నలిస్టులు భారీ ర్యాలీ నిర్వహించారు. అందుకు అఖిలపక్ష నాయకులు మద్ధతు తెలుపుతూ జర్నలిస్టుల వెంటున్నారు. పురవీధులగుండా ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు, జాతీయ రహదారిపైన రాస్తారోకోకు దిగారు.మోహన్ బాబు దాడికి నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విధులు నిర్వహించడానికి వెళ్లిన జర్నలిస్టు రంజిత్ పైన, మోహన్ బాబు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ, కవరేజి కోసం వెళ్లిన రిపోర్టర్ రంజిత్ పైన, మోహన్ బాబు చేసిన దాడి హేయమైన చర్యగా భావించారు. సమగ్ర విచారణ చేపట్టి, వెంటనే మోహన్ బాబును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు.

## రంజిత్ ను పరామర్శించిన విరాహత్ అలీ, టీవీ9 బృందం







కబురు న్యూస్,హైదారాబాద్,డిసెంబర్ 12 :
సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిలో తలకు బలమైన గాయం తగిలి,సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న %జ%9 జర్నలిస్ట్ రంజిత్ ను గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన రంజిత్ ను పలకరించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.రంజిత్ తలపై మోహన్ బాబు లాక్కున్న టీవీ9 లోగోతో బాదడంతో తగిలిన బలమైన గాయం చూసి విరాహత్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సంఘటనను తమ సంఘం తీవ్రంగా పరిగణిస్తుందని,నిందితుడికి చట్టపరంగా శిక్ష పడేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని భరోసా ఇస్తూ,రంజిత్ కు ఆయన ధైర్యాన్ని అందించారు.విరాహత్ తో పాటు టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, హెచ్.యూ.జే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్ లు రంజిత్ ను పరామర్శించారు.

బాధిత జర్నలిస్టుకు మనోధైర్యాన్ని అందించిన

Tv 9 ప్రతినిధి బృందం

మోహన్ బాబు దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ రంజిత్ ను Tv 9 మేనేజింగ్ ఎడిటర్ రజినీకాంత్,ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మురళి కృష్ణ, అవుట్ పుట్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ డియస్ లు పరామర్శించి,ఆందోళన చెందవద్దని తాము అన్ని విధాలా అండగా ఉంటామని మనో ధైర్యాన్ని అందించారు.పరామర్శించిన వారిలో క్రైం బ్యూరో చీఫ్ విజయ్ సాతా,కో-ఆర్డినేటర్ ధర్మారెడ్డి,క్రైం రిపోర్టర్ ప్రణీత తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర సీనియర్ బేస్ బాల్ పోటీలకు జడ్పిహెచ్ఎస్ తొర్లికొండ విద్యార్థులు

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 12 :
ఈనెల 11న జడ్పిహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్ క్రీడా మైదానంలో జరిగిన సీనియర్ బేస్ బాల్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు దేవుడు నాగరాజు మరియు కళ్లెం నరసింహ పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి ఈనెల 13 నుండి 15 వరకు ఎన్టీఆర్ స్టేడియం మహబూబాబాద్ జిల్లా లో జరిగే రాష్ట్ర సీనియర్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ రాష్ట్ర సీనియర్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైన దేవుడు నాగరాజు,కళ్లెం నరసింహ లను



అభినందించారు.పాఠశాల విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు.అలాగే మిగతా విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని మీకు నచ్చిన క్రీడలో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర్, నరసింహారావు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



కబురు న్యూస్, నిజాంపేట్ డిసెంబర్ 12 :
నిజాంపేట మండల కేంద్రానికి చెందిన పున్న అగవ్వ,కు 60 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు సహకరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు మండల గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, మాజీ సర్పంచ్ కొమ్మట సత్యనారాయణ,బాగా గౌడ్, పెద్దపైడి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా జడ్జ్ సునీత కుంచాల...

కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 12 :
ఈనెల 14న జిల్లాలో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పేర్కొన్నారు.గురువారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ,రాజీమార్గమే రాజ మార్గమని ఏళ్ల తరబడిగా వివిధ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్న కక్షిదారులు ఈ లోక్ అదాలత్ ను సద్వినియోగపరుచుకోవాలన్నారు.ఇప్పటికే తమపై కోర్టుల ఆదేశాల ప్రకారం 14వ తేదీన మెగా లోక్ అదాలత్ ఉన్న దృష్ట్యా గత నాలుగు ఐదు రోజుల నుండి జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని ప్రధాన



పట్టణాలలోని చౌరస్తాలలో ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి స్పీకర్లతో నిర్విరామంగా అనౌన్స్ మెంట్ కార్యక్రమం కూడా చేపడుతున్నట్లు ఆమె వివరించారు.ఇందులో కేసును ఒక్కసారి పరిష్కరించుకుంటే అట్టి కేసును శాశ్వతంగా కొట్టివేయడం జరుగుతుందన్నారు.

## తపస్ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

కబురు న్యూస్, నిజాంపేట్ డిసెంబర్ 12 :
పిఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏ లను వెంటనే ప్రకటించాలని, 317 బాధితులకు స్థానికత ఆధారంగా వారి వారి జిల్లాలకు కేటాయించాలని కోరుతూ నిజాంపేట మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి సుకన్య ఆధ్వర్యంలో ఈనెల 17న ఇందిరా పార్క్ లో జరిగే ధర్మాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు ఉపాధ్యాయులందరూ తరలిరావాలని కోరుతూ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉమ్లా నాయక్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మహేందర్ సంఘ నాయకులు రవీందర్ రెడ్డి, అర్జున్, వెంకటస్వామి, ఆలీ సుచరితరాణి తదితరులు పాల్గొన్నారు.

కబురు KABURU TELUGU DAILY


# డబ్బా ప్రభుత్వ పాఠశాల కు డి. జె సౌండ్ బాక్స్ వితరణ .

**కబురు న్యూస్,మెట్ పల్లి, డిసెంబర్ 12..**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా ప్రభుత్వ పాఠశాల కు డబ్బా స్కూల్ నుండి ప్రమోషన్ పై వెళ్లిన గేజీటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు గురువారం మ్యాకల రాజన్న ప్రమోషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీ అందుర్తి స్వామి సత్య నారాయణ, లింగయ ,రాజ్ కుమార్ మ్యాకల మనోజ్ కుమార్ , ప్రసాద్ లు కలసి డి జె సౌండ్ బాక్స్ బహు కరణ చేసారు. ఈ కార్యక్రమం లో డబ్బా ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ తనుగుల రమేష్ , అల్లకట్టు సత్యనారాయణ , ఆడెపు నరేష్ , బొల్లు శంకర్ , వేముల నర్సయ్య లు అంగన్వాడీ టీచర్ గంగామణి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# వెల్లుల్ల ఎల్లమ్మ గుడిని ఎండోమెంట్లు కలప వద్దు... గో బ్లాక్ ఎండోమెంట్ అధికారులు.

.... వెల్లుల గ్రామస్తుల ధర్నా.

... జాతీయ రహదారిపై ఇరువైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు.

**కబురు న్యూస్, మెట్ పల్లి, డిసెంబర్ 12.**




జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలంలోని వెల్లుల్ల ఎల్లమ్మ దేవాలయాన్ని ఎండోమెంట్లో కల్పవద్దని వెల్లుల్ల గ్రామస్తులు గురువారం పట్టణంలోని శాస్త్రీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్ణయించారు . ఈ ధర్నాలో జాతీయ రహదారిపై ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి . గ్రామస్తులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి దేవాలయం పై వచ్చిన ఆదాయం తోనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎల్లమ్మ దేవాలయాన్ని కొందరు స్వార్థ నాయకుల పై గ్రామస్తులు మండిపడ్డారు. ఎల్లమ్మ దేవాలయం ఎండోమెంట్లో కలపడం వల్ల కొంతమంది ఉపాధి కోల్పోతారని ఈ సందర్భంగా అన్నారు. ఎండోమెంట్లో కలిపిన జీవోను వెంటనే వెనక్కు తీసుకోవాలని, ధర్నాలో గో బ్యాక్ ఎండోమెంట్ అధికారులు అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి, డి ఏ ఓ డివిజనల్ అడ్మినిస్ట్ ఆఫీసర్ వసంత మీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సి ఏ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్, మెట్పల్లి ఏ ఎస్ఐ సత్తయ్య, డిస్టిక్ గార్డ్స్, పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్పి రాములు ను సన్మా నించిన ఎస్సీ ఎస్సీ జేఏసీ కమిటీ సభ్యులు.



**కబురు న్యూస్, మెట్ పల్లి, డిసెంబర్ 12.**

మెట్పల్లి పట్టణానికి డిఎస్పిగా రాములు రావడంతోమెట్పల్లి పట్టణంలో గ లఎస్సీ ఎస్టీ కోరుట్ల నియోజకవర్గం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు గురువారంమర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానం చేయడం జరిగింది. బాబాసాహెబ్ అంబేద్కర్ గారి చిత్రపటాన్ని డిఎస్పి రాములు అందించినారు ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జాయింట్ యాక్షన్ అధ్యక్షులు బర్ల సాయన్న, బాల్కశంకర్, బడే లక్ష్మణ్, మేకలహన్మండ్లు, గోరుమంతుల ప్రవీణ్, గోరుమంతుల సురేందర్, నర్స గౌడ్, శ్రీనివాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు...

# ధర్మారం వెంకటేశ్వర స్వామి వారిబ్రహ్మోత్సవాలో పాల్గొన్న సుజిత్ రావు .

**కబురు న్యూస్, మెట్ పల్లి, డిసెంబర్ 12.**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లో ని ధర్మారం గ్రామంలోశ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహొత్సవంలో పాల్గొని టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ దర్శించుకున్నారు.
అనంతరం సుజిత్ రావు , కూన గోవర్ధన్ సన్మానించిన వీడీసీ కమిటీ సభ్యులు..ఈ కార్యక్రమం లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉప అధ్యక్షులు కొడిమ్యాల దీపక్ రాజ్,జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్,మండల సేవాదళ్ అధ్యక్షులు గూడ సొల్లు ముత్యం రెడ్డి,మండల ఫిషర్మాన్ అధ్యక్షులు మగ్గిడి నందం,మండల యూత్ అధ్యక్షులు నల్లూరి సాగర్,మండల యూత్ కాంగ్రెస్ ఉప అధ్యక్షులు అబ్బా రాహుల్,బైండ్ల శ్రీకాంత్,బస సాయన్న,వెంకటేష్, రంజిత్,వల్గోట్ నరేష్,గడసాంద పరమేష్,కనుక దినేష్ కాంగ్రెస్ నాయకులు & వీడీసీ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్ గా మామిడిశెట్టి శ్రీనివాస్ నియామకం

**కబురు న్యూస్, :ధర్మారం డిసెంబర్ 12:**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన మామిడిశెట్టి శ్రీనివాస్ ను సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్ గా నియమిస్తూ సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఛైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ ని నియమిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ : ప్రస్తుతం శ్రీనివాస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ గా విధులు నిర్వహిస్తూ సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రస్తుతం ఆలయన్స్ క్లబ్ అఫ్ ధర్మారం మండల అధ్యక్షునిగా పనిచేస్తున్నారు.వీరు క్లబ్ అధ్యక్షునిగా,క్లబ్ సభ్యుల ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతు పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. వీరు క్లబ్ సభ్యుల ద్వారా యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా, చేడు




మార్గంలో వెళ్లకుండా పలు కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా నిరుద్యోగ యువతి 7 యువకులు,దివ్యంగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా జాబ్ మేళాను నిర్వహించి క్లబ్ ద్వారా యువతను ప్రోత్సహించారు.పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా శ్రీనివాస్ ను గౌరవిస్తూ సోషియల్ జస్టిస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మెన్ గా నియమిస్తూ వారికి నియామక పత్రంతో పాటు గుర్తింపు కార్డు ఇవ్వడం జరిగిందని అన్నారు. నా నియామకానికి సహకరించిన జాతీయ ఛైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ గార్కి ,పలు జిల్లాల్లోని మండలాల చైర్మన్ లకు, అందరికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని మండల సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మెన్ మామిడిశెట్టి శ్రీనివాస్ అన్నారు.

# ఏఐటీయుసి అధ్యక్షులు సీతారామయ్య పై చేసిన ఆరోపణలు అవాస్తవం.

-ఇనుముల రాజమొగిలి మెడికల్ అన్ ఫిట్ విషయంలో ఎలాంటి అవినీతి కి పాల్పడలేదు.

-ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశం లో కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు

**కబురు న్యూస్, రామగుండం డిసెంబర్, 12:**

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పై ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇనుముల రాజమొగిలి తన మెడికల్ అన్ ఫిట్ విషయం లో చేసిన ఆరోపణలు అవాస్తవాలని, ఎలాంటి నిజం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సీతారామయ్య పై రాజమౌళి చేసిన ఆరోపణల పై ఈరోజు వివిధ పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తలను సీతారామయ్య తో మాట్లాడడం జరిగిందని, దీని పై నాకు ఎలాంటి సంబంధం లేదని నన్ను బద్నాం చేయడం కరెక్ట్ కాదని ఆయన అన్నారని వారు తెలిపారు. ఎఐటియుసి లో




గత నలభై ఏళ్ళ నుంచి పిట్ సెక్రటరీ స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షులు గా యూనియన్ అభివృద్ధి కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు సీతారామయ్య అని వారు పేర్కొన్నారు, అటువంటి నాయకుడి పై ఇనుముల రాజమొగిలి అనవసరంగా ఆరోపణలు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. రాజమొగిలి మెడికల్ అన్ ఫిట్ విషయం లో పిట్ ఫర్ సేం జాబ్ అని వచ్చిన తర్వాత సీతారామయ్య ను కలిశాడని, అప్పుడు సీతారామయ్య మన కార్యకర్త అనే ఆలోచన తో అధికారుల తో మాట్లాడి ప్రయత్నం చేద్దాం అని అన్నారని వారు తెలిపారు. మెడికల్ అన్ ఫిట్ విషయం లో సీతారామయ్య రాజమొగిలి వద్ద ఎలాంటి డబ్బులు తీసుకోలేదని, అవినీతి కి పాల్పడలేదని వారు పేర్కొన్నారు. రాజమొగిలి లోకల్ నాయకత్వం తో సంప్రదించకుండా ఏక పక్షంగా ప్రెస్ మీట్ పెట్టి యూనియన్ ను మరియు సీతారామయ్య ను బద్నాం చేయడం సరైంది కాదని వారు పేర్కొన్నారు. సీతారామయ్య పై రాజమొగిలి చేసిన ఆరోపణలు అవాస్తవాలని ఎలాంటి నిజం లేదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు ఉప్పులేటి తిరుపతి, షేక్ అజీం, వి.సుమన్, ఆర్.మహేష్, ఎరవెల్లి రాజయ్య, బండి సతీష్, వి.కిరణ్, కే.రాజేష్, జనగామ జగదీశ్వర్, పల్లె లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వసూళ్ల పై చర్యలు తీసుకోవాలి

- కీలకంగా వ్యవహరిస్తున్న ప్లానర్ల పై సైతం విచారణ జరిపించాలి
- జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్

**కబురు న్యూస్,ఖమ్మం డిసెంబర్ 12:**

ఖమ్మం రూరల్ మండలంలో భవన నిర్మాణ అనుమతుల కోసం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్ నాయక్ ఉన్నత స్థాయి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో స్పందించారు... ప్రజా పాలన ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే అధికారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదు అన్నారు. పారదర్శకంగా ఇవ్వాల్సిన అనుమతుల్లో అవినీతి వసూళ్లకు పాల్పడటం ఎంతవరకు



సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చే పన్నుల ద్వారా జీతాలను పొందుతూ.. మరలా వారి కష్టార్జితాన్ని ఈ విధంగా దోపిడీ చేయడం దారుణమైన అంశంగా పేర్కొన్నారు. అధికారుల అవినీతి వల్లనే ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఆరోపించారు. ఈ నిర్మాణాలు అధికారుల ఆమ్యామ్యాల వల్లనే జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అనుమతుల మేరకు ఎక్కడ నిర్మాణాలు జరగడంలేదని, పట్టించుకోవాల్సిన అధికారులు ఉధాసీనత కనబరచడంలో ఆంతర్యం ఏమిటో అర్థమవుతుందన్నారు. అవినీతి వసూళ్లకు పాల్పడుతున్న అధికారి ప్లానర్ల ద్వారా డబ్బులు తీసుకుంటున్నట్టు ప్రజలు పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు . పర్మిషన్లు తీసుకునే వారిలో ఎవరిని కదిలించిన ప్లానర్ల గురించే వివరిస్తున్నారు . సారుకు డబ్బులు ఇస్తే పర్మిషన్ వస్తుందని బహిరంగంగానే అడుగుతుండడం వారి అవినీతికి అద్దం పడుతుందన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డిపిఓ ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# జిల్లాస్థాయి పోటీలకు మల్లాపూర్ క్రీడాకారులు ఎంపిక

**కబురు న్యూస్, డిసెంబర్ 12**

ఇటీవల జరిగిన మల్లాపూర్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మల్లాపూర్ కి చెందిన క్రీడాకారులు అలగుంట భాస్కర్ సుర అరవిందు అని ఇద్దరు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాసరెడ్డి క్రీడాకారులను కలుసుకొని వారి యొక్క ప్రతిభను తెలుసుకొని వారు మునుముందు అనేక అత్యుత్తమ శిఖరాలను అధిరోహించాలని వారి యొక్క ఉన్నతికి ఎల్లవేళలా భారతీయ జనతా పార్టీ తరఫున గాని నా తరఫున గాని సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలుపుతూ ఆ ఇద్దరు క్రీడాకారులను అభినందించారు



# భారత్ మార్కెట్లోకి టయోటా కమ్రీ.. మైలేజీ ఇలా.. రూ.48 లక్షల నుంచి షురూ..!

**ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ తన సెడాన్ మోడల్ కారు క్రమీ అప్ డేటెడ్ వర్షన్ ను భారత్ మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.48 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. సేఫ్టీతోపాటు అదనపు ఫీచర్లు, న్యూ ఇంటీరియర్ లే ఔట్, ఆల్ న్యూ డిజైన్లు ఉన్నాయి. గత మోడల్ క్రమీ కారు కంటే మైలేజీ ఎక్కువ కావడంతోపాటు ధర కూడా 1.83 లక్షలు ఎక్కువ. ఆసక్తిగల కస్టమర్లు తమకు సమీప డీలర్ వద్ద గానీ, టయోటా ఆన్ లైన్ లోగా ప్రీ బుకింగ్స్ నమోదు చేసుకోవాలని సూచించింది. తక్షణం కార్ల డెలివరీ ప్రారంభం కానున్నట్లు టయోటా కిర్లోస్కర్ తెలిపింది.**

కబురు న్యూస్, డెస్క్ : డిసెంబర్ 12

న్యూ టయోటా క్రమీ 9-జనరేషన్ కారు టీఎన్జీఏ-కే ప్లాట్‌ఫామ్‌పై రూపుదిద్దుకున్నది. లెక్సస్, అల్ ఫార్డ్, స్లెన్నా, వెంజా, లెక్సస్ ఈఎస్, లెక్సస్ ఆర్ఎక్స్ తదితర మోడల్ కార్ల స్ఫూర్తితో డిజైన్ చేశారు టయోటా న్యూ క్రమీ కారు. ఫిఫ్త్ జనరేషన్ హైబ్రీడ్ సిస్టమ్ (టీహెచ్ఎస్ -5)తోపాటు 2.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 230 హెచ్పీ పవర్ వెలువరించడంతోపాటు లీటర్ పెట్రోల్ మీద 25 కి.మీ మైలేజీ ఇస్తుంది. ఈ-సీవీటీ గేర్ బాక్స్‌తోనూ వస్తుందీ కారు.

న్యూ టయోటా క్రమీ 9-జనరేషన్ కారు ఫ్రంట్‌లో న్యూ హెడ్ ల్యాంప్ డిజైన్ ఇంటిగ్రేటెడ్ విత్ బ్లాక్ ఎలిమెంట్, హనీ కాంబ్ ప్యాటర్న్ గ్రిల్లె, మోర్ స్లోప్డ్ రూఫ్ లైన్స్, రీడిజైన్డ్ టెయిల్ ల్యాంప్స్, రేర్ బంపర్ ఉంటాయి. ఇంటీరియర్‌గా 7.0 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫ్లోటింగ్ 12.3 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, నైన్ స్పీకర్ జేబీఎల్ ఆడియో సిస్టమ్, వెంటిలేటెడ్ సీట్స్, 360 డిగ్రీ కెమెరా, వైర్ లెస్ ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, హెచ్‌యూడీ డిస్‌ప్లే, త్రీ జోన్ క్లైమేట్ కంట్రోల్, 10-వే పవర్డ్ ఫ్రంట్ సీట్స్ విత్ హీటెడ్ అండ్ వెంటిలేటెడ్ ఫంక్షన్, ఎలక్ట్రిక్ సన్ రూఫ్ తదితర ఫీచర్లు ఉన్నాయి.

టయోటా క్రమీ 9-జనరేషన్ కారులో సేఫ్టీ సెన్స్ 3.0 అడాస్ సూట్, ప్రీ కొల్లిషన్ అసిస్ట్ విత్ పెడెస్ట్రియన్ డిటెక్షన్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీప్ అసిస్ట్, రోడ్ సైన్ రికగ్నిషన్, ఆటోమేటిక్ హై బీమ్, 9-ఎయిర్ బ్యాగ్స్ తోపాటు ఫ్రంట్ అండ్ బ్యాక్ పార్కింగ్ సెన్సర్లు, 360-డిగ్రీ కెమెరా ఉంటాయి. స్కోడా సూపర్బ్ మోడల్ కారుతోపాటు ఆడి ఏ4, మెర్సిడెజ్ సీ-క్లాస్, బీఎండబ్ల్యూ3 సిరీస్ గ్రాన్ లిమౌసిన్ కార్లతో టయోటా క్రమీ 9- జనరేషన్ కారు పోటీ పడుతుంది.



# పతనమైన ఎఫ్ఎంసీజీ.. ఐటీ షైనింగ్.. అయినా నష్టాల్లోనే ఇండెక్స్ సూచీలు..!

కబురు న్యూస్, డెస్క్ : డిసెంబర్ 12


దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 236.18 పాయింట్లు (0.29 శాతం) నష్టంతో 81,289.96 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 81,211.64 పాయింట్ల అత్యంత కనిష్ట స్థాయి నుంచి 81,680.97 పాయింట్ల గరిష్టం మధ్య తచ్చాడింది. బీఎస్ఈ-30లో 18 స్టాక్స్ పతనాలతోనే ముగిశాయి. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 93.10 పాయింట్లు (0.38 శాతం) నష్టంతో 24,548.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 24,675.25 పాయింట్ల నుంచి 24,527.95 పాయింట్ల మధ్య తచ్చాడింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ -100 0.46 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.9 శాతం నష్టపోయాయి.ఎన్ఎస్ఈ-50లో 35 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఎన్టీపీసీ, హిందూస్థాన్ యూనీ లివర్, కోల్ ఇండియా, హీరో మోటో కార్ప్, బీపీసీఎల్ తదితర స్టాక్స్ 2.63 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు అదానీ ఎంటర్ ప్రైజెస్, భారతీ ఎయిర్ టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ స్టాక్స్ 1.90 శాతం వరకూ లాభ పడ్డాయి. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మెటల్ ఇండెక్సులు 0.77 శాతం వరకూ లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.09 శాతం నష్టపోగా, వాటిలో హిందూస్థాన్ యూనీ లివర్, గోద్రేజ్ ప్రాపర్టీస్, కోల్గేట్ పామోలివ్ స్టాక్స్ పతనం అయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ 84.87 పాయింట్ల వద్ద ముగిసింది.

# సాంకేతిక లోపంతో చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. ఇబ్బందుల్లో యూజర్లు..!

కబురు న్యూస్, డెస్క్ : డిసెంబర్ 12

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బేస్డ్ చాట్‌బోట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా లక్షలాది మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు లభించక పోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు. దీనిపై యూజర్లకు 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా క్షమాపణ చెప్పిన ఓపెన్ ఏఐ.. సమస్య గుర్తించామని, దాని పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని తెలిపింది. త్వరలోనే చాట్‌జీపీటీ గ్లోబల్ ఔటేజ్‌పై అప్‌డేట్ ఇస్తామని పేర్కొంది. స్థానిక కాలమానం ప్రకారం గురువారం తెల్లవారు జాము నుంచి చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. చాట్‌జీపీటీతోపాటు సంస్థకు చెందిన ఏపీఐ, సోరా సేవల్లో ఈ సమస్య తలెత్తిందని ఓపెన్ ఏఐ తెలిపింది. అయితే, ఎప్పటిలోగా సమస్య పరిష్కారం అవుతుందో వెల్లడించలేదు. దీనివల్ల ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీపై ఆధార పడిన సంస్థల కార్యకలాపాలపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు.

2022 చివర్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పని చేసే చాట్‌జీపీటీని ఓపెన్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్‌బోట్ సాయంతో యూజర్లు తమకు అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని సెకన్లలోనే అందుకోవచ్చు. కాగా, బుధవారం రాత్రి మెసేజింగ్ యాప్ వాట్సాప్‌తోపాటు ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ సేవల్లో అంతరాయం నెలకొంది. సాంకేతిక లోపం వల్ల యూజర్లు తమ యాప్స్ సేవలు ఉపయోగించుకోలేదని మెటా పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా సేవలు పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నామని వివరించింది.





# ఫ్లాట్‌గా ప్రారంభమైన స్టాక్ మార్కెట్ సూచీలు

కబురు న్యూస్, డెస్క్ : డిసెంబర్ 12

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (%హాశీఏని ఝతీనెవ్%) గురువారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపటికే స్వల్ప లాభాల్లోకి జారుకున్నాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 97 పాయింట్లు పెరిగి 81,623 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 11 పాయింట్లు పెరిగి 24,653 వద్ద కొనసాగుతోంది.

సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. టాటా మోటార్స్, టైటాన్, ఎల్అండ్‌టీ, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ, ఎన్టీపీసీ, ఐటీసీ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,778 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.85 వద్ద కొనసాగుతోంది.అమెరికా ద్రవ్యోల్బణం నవంబరులో అంచనాలకు అనుగుణంగా 2.7శాతంగా నమోదుకావడంతో నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో నాస్‌డాక్ తొలిసారిగా 20,000 పాయింట్లకు చేరింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 0.22 శాతం నష్టంలో ట్రేడవుతుండగా.. జపాన్ నిక్కీ 1.09 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.14 శాతం, షాంఘై 0.35 శాతం లాభంతో కదలాడుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు బుధవారం నికరంగా రూ.1,012 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. ఇక దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.2008 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.





# అసలేమీ చెప్పొద్దన్నారు ఆ సినిమా గురించి!

కబురు సినిమా డిసెంబర్ 12..

“తొలి నుంచీ పల్లెటూరి అమ్మాయి పాత్రలే నా దగ్గరికొచ్చాయి. ఈసారి అందుకు భిన్నంగా... నగర సంస్కృతిని ఇష్టపడే అమ్మాయి పాత్రని పోషించా” అన్నారు అమృత అయ్యర్. ‘30 రోజుల్లో ప్రేమించడం ఎలా’, ‘రెడ్’ తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఆమె.. ‘హను– మాన్’తో పాన్ ఇండియా స్థాయిలో మెరిశారు. అచ్చ తెలుగమ్మాయిలా కనిపించే ఆమె ఇటీవల అల్లరి నరేశ్‌తో కలిసి ‘బచ్చలమల్లి’లో నటించారు. ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.“మొదటి నుంచీ అర్థవంతమైన పాత్రలు చేయాలన్న సంకల్పంతోనే నా ప్రయాణం కొనసాగుతోంది. ‘బచ్చలమల్లి’ సినిమాతో అలాంటి పాత్రే దొరికింది. ‘హను – మాన్’ చేస్తున్నప్పుడే ఈ కథ విన్నా. దర్శకుడు సుబ్బు చెప్పిన ఈ కథ, పాత్ర రెండూ అమితంగా నచ్చాయి. దాంతో వెంటనే అంగీకారం తెలిపా. ‘హను – మాన్’ తర్వాత వచ్చినా ఈ కథని కచ్చితంగా ఒప్పుకునేదాన్ని. ఆ స్థాయిలో నన్ను ప్రభావితం చేసిన సినిమా ఇది. బలమైన భావోద్వేగాలున్న ఇలాంటి మంచి కథలో భాగం కావడం ఎంతో తృప్తినిచ్చింది. నిర్మాత రాజేశ్ దండా ఇదివరకే నాతో సినిమా చేయాలనుకున్నారు. అప్పుడు కుదరకపోయినా ఈసారి చేశాను”. “1980 దశకం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఓ చిన్న టౌన్‌లో జరిగే కథ ఇది. నేను మాత్రం ఓ సిటీ అమ్మాయిలా కనిపిస్తా. కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చే ఓ సున్నితమైన అమ్మాయి తను. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలకి పూర్తి భిన్నం. ఈ సినిమా తర్వాత మరింత ట్రెండీగా కనిపించే పాత్రల్ని పోషిస్తాననే ఓ బలమైన నమ్మకం ఉంది. నాకూ, అల్లరి నరేశ్‌కీ మధ్య బలమైన భావోద్వేగాలు ఉంటాయి. అవి సినిమాకి కీలకం. నరేశ్ మంచి నటుడు. ఎలాంటి భావోద్వేగమైనా సరే, ఇట్టే పండిస్తారు. ఈ సినిమాలో ఎంతో దూకుడైన పాత్రలో కనిపిస్తారు. ఆయన అంత గాఢమైన పాత్రలో నటిస్తున్నా... షాట్ పూర్తవ్వగానే అందరితో ఎంతో స్నేహంగా మెలిగేవారు. తన అనుభవాల్ని పంచుకునేవారు. ఆయనతో పనిచేయడం మంచి అనుభవం. దర్శకుడు సుబ్బు ఎంతో విజన్ ఉన్న దర్శకుడు. తను ఈ సినిమా విషయంలో చాలా ఫోకస్‌గా పనిచేశారు. భావోద్వేగాలున్న కథ కావడంతో ఆ ప్రభావం ప్రతి సన్నివేశంలోనూ కనిపించాలనే తపనతో పనిచేశారు”.

## అలాంటి పాత్రల్లో నటించాలనేది కోరిక

“చేసిన ప్రతి సినిమా పాన్ ఇండియా స్థాయికి వెళ్లదు. ‘హను – మాన్’ కూడా ముందు తెలుగు సినిమాలాగే మొదలుపెట్టాం. ఆ తర్వాత పాన్ ఇండియా స్థాయికి వెళ్లింది. ‘హను –మాన్’ తర్వాత కూడా కథల ఎంపికపరంగా ఇదివరకటిలాగే జాగ్రత్తలు తీసుకుంటున్నా. డ్రీమ్ గాళ్, యువరాణి తరహా పాత్రలు చేయాలనే కోరిక బలంగా ఉంది. ‘పొన్నియిన్ సెల్వన్’ చూశాక ఆ కోరిక మరింతగా పెరిగింది. యాక్షన్ ప్రధానమైన పాత్రలన్నా ఇష్టమే. ప్రస్తుతం కన్నడ, తమిళంలో సినిమాలు చేస్తున్నా. తెలుగులో స్క్రిప్టులు వింటున్నా. ‘జై హనుమాన్’ గురించి అసలేమీ చెప్పొద్దు అన్నారు. ఇప్పుడు తెలుగు పూర్తిగా మాట్లాడుతున్నా. డబ్బింగ్ నేనే చెబుతానంటే ‘నీ మాటలు చిన్న పిల్లలు మాట్లాడినట్టుగా ఉంటాయ’ని దర్శకులు వద్దంటున్నారు (నవ్వుతూ). దర్శకులు అవకాశం ఇస్తే తప్పకుండా నా గొంతు వినిపిస్తా”.


### పాటలే ప్రత్యేకం..

“నేను తెలుగులో సినిమా చేస్తున్నానంటే కచ్చితంగా రాజమండ్రి, అన్నవరం పరిసర ప్రాంతాల్లో ఒక్కరోజైనా చిత్రీకరణ చేయాల్సిందే. ఈ సినిమాకీ ఆ సెంటిమెంట్ పునరావృతమైంది. అన్నవరం పరిసరాల్లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించాం. నా సినిమాల్లోని పాటలు కూడా విశేష ఆదరణ పొందుతుంటాయి. ‘నీలి నీలి ఆకాశం...’ నుంచీ ‘హను–మాన్’లో ‘పూలమ్మే పిల్ల...’ పాట వరకూ అదే వరస. నేను తమిళంలో చేసిన సినిమాలూ అంతే. వాటిల్లోని పాటలు ప్రత్యేకంగా ఆకర్షిస్తుంటాయి. ఈ సినిమా విషయంలోనూ అదే జరిగింది. ‘సీతారామం’ ఫేం విశాల్ చంద్రశేఖర్ సంగీతం అనగానే ఎంతో ఆనందం కలిగింది. ఈ సినిమా విడుదల తర్వాత పాటలు మరింత బలంగా వినిపిస్తాయి”.

# నయనతారకు మద్రాసు హైకోర్టు నోటీసులు

కబురు సినిమా డిసెంబర్ 12..

‘నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్’ అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, తమిళ స్టార్ నటుడు ధనుష్ మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా ‘నేనూ రౌడీనే’ మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ ధనుష్ ఇటీవలే మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై దావా వేశారు. దీనిపై తాజాగా మద్రాసు హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై జనవరి 8వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు నయన్ దంపతులతోపాటు నెట్‌ఫ్లిక్స్‌కు నోటీసులు జారీ చేసింది. విఘ్నేష్ దర్శకత్వంలో వహించిన ‘నానుమ్ రౌడీ దాన్’(2016) సినిమా నయన్ జీవితంలో కీలకం. ఆ సినిమా సమయంలోనే వారిద్దరూ ప్రేమలో పడ్డారు. అందుకే అందులోని సన్నివేశాలను, పాటలను డాక్యుమెంటరీలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో.. దానికి సంబంధించిన ఎన్‌వోసీ(అనుమతి పత్రం) కోసం ఆ చిత్ర నిర్మాతైన హీరో ధనుష్‌ని డాక్యుమెంటరీ మేకర్స్ సంప్రదించారు. రెండేళ్లపాటు పోరాడినా ధనుష్ మాత్రం అందుకు అనుమతి ఇవ్వలేదు. డాక్యుమెంటరీ స్ట్రీమింగ్‌కి వస్తున్న నేపథ్యంలో రీసెంట్‌గా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో ‘నానుమ్ రౌడీ దాన్’ సినిమాలోని మూడు సెకన్ల క్లిప్స్ ఉండటంతో, అందుకు నష్టపరిహారంగా 10కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ నయనతార టీమ్‌కు ధనుష్ లీగల్ నోటీసులు పంపారు. దాంతో మనసు నొచ్చుకున్న నయనతార.. ధనుష్‌కు భారీ లెటర్‌ని రాసింది. ఇందులో ఆయనపై తీవ్ర విమర్శలు చేసింది. దీంతో ఆగ్రహించిన ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నయన్ దంపతులపై దావా వేశారు.



# బాలయ్య సినిమాల వరుస అప్డేట్స్.. ప్రోమో, ఫస్ట్ సింగిల్ వచ్చేస్తున్నాయి

కబురు సినిమా డిసెంబర్ 12..

బాలయ్య నటించే సినిమాల నుంచి వరుస అప్డేట్స్ వస్తున్నాయి. నిన్న డిసెంబర్ 11 న అఖండ రిలీజ్ డేట్ రాగా.. తాజాగా డాకు మహారాజ్ అప్డేట్ వచ్చింది. డైరెక్టర్ బాబీ తెరకెక్కిస్తున్న డాకు మహారాజ్ నుంచి ప్రోమో అండ్ ఫస్ట్ సింగిల్ రిలీజ్ అప్డేట్స్ వచ్చాయి.డాకు మహారాజ్ ప్రోమో రేపు శుక్రవారం Dec 13న ఉదయం 10:08 రానుంది. ఫస్ట్ సింగిల్ డిసెంబర్ 14న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ వెల్లడించలేదు. ఈ లేటెస్ట్ అప్డేట్స్ తో బాలయ్య ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. ఇక రేపు రానున్న డాకు మహారాజ్ ప్రోమో ఏ లెవల్లో ఉండనుందో తెలియాలంటే ఇంకొన్ని గంటలు ఆగాల్సిందే.సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీ 2025 జనవరి 12న థియేటర్స్‌లో రాబోతోంది. తమన్ సంగీతం అందిస్తున్నాడు.ఇప్పటికే ఈ మూవీ నుంచి టీజర్, ట్రైలర్ సాంగ్స్ ఆడియన్స్ లో ఆసక్తిని పెంచేశాయి. బాలయ్య కెరీర్‌లో ఇది 109వ చిత్రం. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, బాబీ డియోల్, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# విజయ్ దేవరకొండ.. ఎల్లప్పుడూ సపోర్ట్ చేస్తారు

కబురు సినిమా డిసెంబర్ 12..

‘పుష్ప 2 ది రూల్’ తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు నటి రష్మిక . ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోన్న ఆమె తాజాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులోభాగంగా తాను ఇప్పటివరకూ వర్క్ చేసిన పలువురు హీరోలను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.“రణ్‌బీర్ కపూర్‌తో వర్క్ చేయడం చాలా సులభంగా ఉంటుంది. అల్లు అర్జున్ ఎంతో తెలివైన నటుడు. ‘పుష్ప 2’లో ఆయన నటన అద్భుతంగా ఉంటుంది. చీర ధరించి డ్యాన్స్ చేయడం.. ఫైట్ చేయడం.. ఆయన వల్లే సాధ్యమైంది. ఇలాంటి సాహసం వేరే ఏ నటుడు చేయలేకపోవచ్చు. సల్మాన్‌ఖాన్ సెట్‌లో సరదాగా ఉంటారు. ఆయన సెట్‌లో ఉన్నారంటే షూట్ సరదాగా సాగుతుంది. జోక్స్ వేసి పక్క వాళ్లను నవ్విస్తుంటారు. విక్కీ కౌశల్ నుంచి యాక్టింగ్‌కు సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. గొప్ప నటుడు. విజయ్‌కు నేను వీరాభిమానిని. ఆయన అంటే నాకెంతో ఇష్టం” “విజయ్ దేవరకొండ నాకెల్లప్పుడూ సపోర్ట్ చేస్తుంటారు. ‘ది గర్ల్‌ఫ్రెండ్’ టీజర్ విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్ ఇచ్చిన విషయం చివరివరకూ నాకు తెలియదు. అది విడుదలయ్యాక విజయ్ వాయిస్ విని నేను ఆశ్చర్యపోయా. నాకు చాలా ప్రత్యేకంగా అనిపించింది” అని రష్మిక తెలిపారు. ప్రేక్షకులను అలరించేందుకు తాను ప్రతిరోజూ ఇంకా శ్రమిస్తూనే ఉంటానని అన్నారు.అనంతరం ఆమె సల్మాన్ ఖాన్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై మరో ఇంటర్వ్యూలో మాట్లాడారు. “సికందర్’ కోసం ఆయనతో కలిసి వర్క్ చేస్తున్నా. ఆయన ఎంతో మంచి వ్యక్తి. సెట్‌లో ఎప్పుడూ సరదాగా ఉంటారు. షూట్ సమయంలో ఓసారి నేను అనారోగ్యానికి గురయ్యా. విషయం తెలుసుకున్న ఆయన నాకు మంచి భోజనం ఏర్పాటుచేశారు. నన్ను అన్నివిధాలా సంరక్షించారు. ఆ సమయంలో నాకెంతో ధైర్యంగా అనిపించింది” అని వెల్లడించారు.రష్మిక ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌లు చేస్తున్నారు. ‘సికందర్’, ‘ఛావా’ చిత్రీకరణ దశల్లో ఉన్నాయి. ఆమె కీలకపాత్రలో యాక్ట్ చేస్తోన్న ‘కుబేర’ కూడా షూట్ దశలో ఉంది. ధనుష్ హీరోగా ఈ సినిమా తెరకెక్కుతోంది. శేఖర్ కమ్ముల దర్శకుడు. నాగార్జున ముఖ్య భూమిక పోషిస్తున్నారు. దీనితోపాటు ఆమె ‘ది గర్ల్‌ఫ్రెండ్’ కోసం వర్క్ చేస్తున్నారు.



Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com